# మూడు చలి కాలాలు

ఈసారి చలికాలం మరీ నిర్దయగా అన్పిస్తోంది. డిసెంబరు నెల చివరి వారం- శరీరం మంచు ముద్దలా ఘనీభవించినట్లు . . . రక్తం గడ్డకట్టించేలాంటి చలి . . . దుప్పటి నిండుగా కప్పుకుని మునగదీసుకుని పడుకున్నా చలికి కనికరం లేదు. కసిగా నా ఎముకల్లోకి దూరి కసాబిసా నమిలేస్తోంది.

నిజంగానే చలి తీవ్రత తట్టుకోలేనంత ఉందా లేక వయసు పైబడినందువల్ల నా శరీరం సుడిగాలిలో చిగురుటాకులా చలికి గజగజ వణికిపోతోందా . . . ఆలోచనల్తో సరిగ్గా నిద్ర పట్టని నాకు ఈ చలి కూడా కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది.

పదవీ విరమణ చేసి నాలుగు సంవత్సరాలైంది. రెండేళ్ళ క్రితం భార్యావియోగం . . . ఎందుకో ఒంటరితనమనిపిస్తోంది . . . భయంకరమైన ఒంటరితనం . . . ముసలి తనంతోపాటు ముంచుకొచ్చే ఆరోగ్య సమస్యలు . . . ఒక్కోసారి జీవితం దుర్భరమనిపిస్తోంది. దేనిమీదా అనురక్తి కలగటం లేదు.

ఎంత ప్రయత్నించినా నిద్ర పట్టటం లేదు. ఆలోచనలు . . . మెదణ్ణి తొల్చు కుంటూ . . . గతం బొరియలోకి జారుకుంటూ . . . మెలికలు తిరుగుతూ . . . మనసుని పదునైన కత్తిలా సర్రున కోసుకుంటూ . . . ఆలోచనలు . . .

అర్ధరాత్రి దాటాక ఎప్పటికో మాగన్నుగా నిద్ర పట్టిన కొద్ది సేపటికే కోడలి పిలుపుతో మెలకువొచ్చేసింది.

"మామయ్యా-లేవండి. వెళ్ళి పాలప్యాకెట్ తీసుకురావాలి" అంటోంది కోడలు.

నేను సమాధానం చెప్పేలోపలే నా కొడుకు గొంతు మంద్ర స్థాయిలో విన్పించింది. "ఈ వయసులో ఆయన్నెందుకు ఇబ్బంది పెట్టటం . . . చలి విపరీతంగా ఉంది. మంచు కూడా కురుస్తున్నట్లుంది. ఆయన్ని పడుకోనీ. నేను వెళ్తాను"

"మీరు బైటికెళ్ళాక పొరపాటున ఏ ఫ్రెండో దొరికితే యిక యిల్లూ, యిల్లాలు గుర్తుండవు. మీరిక్కడ చేయాల్సిన పన్లు బోల్డున్నాయి. మొదట కూరగాయలు తరిగివ్వండి. పిల్లల్ని లేపి చదువుకోమని చెప్పండి. పాలకోసం మామయ్య వెళ్తార్లెండి" అంది కోడలు. ఆమె గొంతులోని

స్థిరత్వానికి వెంటనే లేచి కూచున్నాను.

కోడలు నా చేతిలో పాల కార్డుతో పాటు స్వెట్టరూ, మఫ్లరూ పెట్టి, "తల చుట్టూ మఫ్లర్ని గట్టిగా కట్టుకోండి. చలిగాలి తగలదు" అంటూ ఉచిత సలహా కూడా ఇచ్చింది.

శరీరాన్ని ఎంతగా కప్పుకున్నా చలిగాలి సూదుల్లా గుచ్చుకుంటూనే ఉంది. మసక చీకటి . . . . మెల్లగా నడుస్తున్నాను. కీళ్లు కదలడానికి మొరాయిస్తూ కరకర శబ్దంతో తమ నిరసనని తెలియచేస్తున్నాయి. పట్టుబడిన కండరాలు వెచ్చదనం కోసం ఆరాట పడ్తున్నాయి.

నాకు చప్పున మా అమ్మ గుర్తొచ్చింది. ఇలాంటి చలిలోనే కదూ అందరికంటే ముందుగా లేచి ఇంటిపనంతా చేసేది . . . ఎంత చలికాలమైనా ఉదయం నాల్గింటికే లేచేది. నూతి నుంచి నీళ్ళు తోడుకొచ్చేది. ఇంటి ముందు కళ్ళాపి చల్లి ముగ్గులేసేది. అంట్లన్నీ తోమేది.

అమ్మకు చలి వేయదా? చన్నీళ్ళలో చేతులుంచి పన్లన్నీ ఎలా చేస్తుందో? వేళ్ళు కొంకర్లు పోవా? అమ్మ శరీరం ప్రత్యేకంగా తయారుచేయబడలేదుగా. మరెందుకు పాపం మాకు మల్లే వెచ్చగా దుప్పటి కప్పుకుని పడుకోవాలనుకోదూ? పదేళ్ళ వయసున్న నాలో సవాలక్ష ప్రశ్నలు...

అసలే పల్లెటూరు. విపరీతమైన చలిగా ఉండేది. నాన్న ముసుగు తన్ని పడుకుని గురకపెడ్తుంటే నాకు వళ్ళు మండేది. పాపం అమ్మ... తనొక్కతే చాకిరీ చేస్తుంటే ఈయనకు నిద్రెలా పడ్తోందీ అనుకునే వాడిని. ఇలా వెచ్చగా దుప్పట్లో మహరాజులా పడుకోకపోతే లేచి అమ్మకు సాయం చేయవచ్చుగా . . . అమ్మా మనిషే కదా . . . తనకూ ఉండదా ఆరింటి వరకూ మహరాణిలా ముసుగు తన్నిపడుకోవాలనీ . . .

అమ్మనోసారి ఇదే ప్రశ్న అడిగాను. ఆమె వెన్నెల కురిసినట్లు చల్లగా నవ్వి "ఎందుకుండదూ . . . కానీ అప్పుడు పనులెలా అవుతాయి? వంటెలా అవుతుంది? నీకు పెళ్ళిచేస్తే నాకు కోడలొస్తుంది కదా. అప్పుడు నీ కోరిక ప్రకారమే చలికాలంలో హాయిగా, వెచ్చగా ఆరింటి వరకూ పడుకుంటాన్లే" అంది.

నాన్న ఎలిమెంటరీ స్కూల్లో బడిపంతులుగా చేసేవారు. ఎనిమిదింటికి స్కూలు . . . ఆయన మగమహారాజు కదా. ఆరింటికి లేచి, అమ్మ తోడిపెట్టిన వేన్నీళ్ళ స్నానం చేసి, అమ్మ వండిపెట్టిన ఫలహారం తిని, చేతిలో పేంబెత్తం పట్టుకుని దర్జాగా నడుచుకుంటూ స్కూలుకెళ్ళే వారు. అంట్లు తోమడం . . . వంట చేయడం . . . లాంటివి ఆడవాళ్ళే చేయాలని శాసనమేం లేదుగా. చలిపొద్దున అమ్మతో పాటు లేచి పన్లు చేయవచ్చుగా . . . అమ్మను ఇదీ అడిగాను.

"ఆయనంటే మగాడు కదా . . . మరి నన్ను పెళ్ళి చేసుకున్నది చాకిరీ చేయడానికేగా నాయనా" అంది. ఆమె మాటల్లో చాకిరీ చేసునందుకు బాధలేదు . . . సంతోషం ఉంది. తన

జన్మ సాఫల్యం అందులోనే ఉన్నట్లు మాట్లాడింది అమ్మ.

చేతులు కొంకర్లు పోయేంత చలిలో చన్నీళ్లతో పనులు చేస్తున్న అమ్మను చూసి నేను బాధ పడటం తప్ప అమ్మకు కించిత్తు విచారం కూడా లేకపోవటం నాకు ఆశ్చర్యాన్ని కలుగచేసింది.

"అంటే మగవాడు పెళ్ళి చేసుకునేది ఆడదానిచేత నానా చాకిరీ చేయించుకోడానికేనా అమ్మా . . . ఆడది కష్టపడాలా . . . మగవాడు సుఖపడాలా . . . ఇలా అని దేవుడేమైనా చెప్పాడా" అని అడిగాను.

అమ్మ మరలా నవ్వింది. "నువ్వు పెళ్ళి చేసుకున్నాక భార్యని సుఖపెడ్దువు గానీలే బాబూ" అంది మురిపెంగా. నేను పెందలకాడే లేచి నీకు సాయపడ్తానమ్మా అంటే వినేది కాదు. "నువ్వు బాగా చదువుకో నాన్నా. చాలు. నాకు సాయపడినదాని కన్నా ఎక్కువ సంతోషపడ్తాను" అనేది.

నా పెళ్ళి కాకముందే అమ్మ చనిపోయింది. చలికాలంలో కూడా అమ్మ వెచ్చగా దుప్పటి కప్పుకుని ఆరింటివరకూ పడుకుంటే చూడాలనే నా కోరిక తీరకుండానే అమ్మ వెళ్ళిపోయింది.

పాల ప్యాకెట్లిచ్చే చోటు సమీపించే కొద్దీ నా ఆలోచనల్నించి బైట పడ్డాను. పక్కింటి రాఘవయ్య కన్పించాడక్కడ. "నిన్నూ నీ కోడలు రాక్షసి ఇంత చలిలో ముసలాడివనైనా చూడకుండా రోడ్డు మీదికి తరిమింది కదూ" అన్నాడు.

నాలో మరలా ఆలోచనలు.. ఇంత చలిలో బైటికి రావడం, అందునా ఈ వయసులో . . . ఇబ్బందిగానే ఉంది. కానీ కోడలిది రాక్షసత్వమా . . . అంత దృఢంగా తనకేం కావాలో అడిగి చేయించుకోవడం గయ్యాళితనమా . . .

నేనేమీ మాట్లాడకపోవడం చూసి రాఘవయ్యే మరలా అన్నాడు "నా కోడలి గురించి తెల్సుగా . . . సూర్యకాంతానికి చెల్లెలు, ఛాయాదేవికి అక్కగారు... నా కొడుకేమో చవట దద్దమ్మ. పెళ్ళాం కొంగట్టుకు తిరగటం తప్ప మగవాడిలా దాష్టీకం చెలాయించటం తెలీని వాజమ్మ. రిటైర్మెంట్ సొమ్మంతా మింగేశారుగా. ఇక నాదగ్గర పీక్కుతినడానికేముందని? శుష్కమైన నా శరీరం, ఛిద్రమైన నా హృదయం తప్ప"

రాఘవయ్యా, నేనూ పాల ప్యాకెట్లు తీసుకున్నాం.

"కొడుకుల్ని పెంచి, పెద్ద చేసి, విద్యాబుద్ధులు నేర్పించి, ఇంతవార్ని చేయడానికి నా జీవితాన్నంతా ధారపోశాను. ఈ ముసలి వయసులోనైనా కాసింత సుఖపడదామంటే నా కోడలు పడనివ్వటం లేదు. నేనేదో పనీపాటాలేకుండా ఆమె పెట్టే తిండిని తేరగా తింటున్నానని ఆమె ఆలోచన . . . ఏదో ఒక పని చెప్తోనే ఉంటుంది. నాచేత ఏదో ఒక రోజు అంట్లు కూడా

తోమిస్తుంది చూడు. జీవితం ఇంత దుర్భరమౌతుందని నేనెప్పుడూ వూహించలేదు" రాఘవయ్య గొంతు దుఃఖంతో వణికింది.

దారిలో రమణమూర్తి మాతో కలిశాడు. మాయింటికి నాలుగిళ్ళవతల ఉండే రమణమూర్తిది దాదాపు మా వయసే. బ్యాంకులో ఉద్యోగం చేసి రెండేళ్ళక్రితం రిటైరైనాడు. ముగ్గురం కబుర్లలో పడ్డాం. ఎన్ని రకాల సంభాషణలు ఎత్తుకున్నా, చివరికవి కొడుకుల దుర్మార్గాలు, కోడళ్ళ దాష్టికాల వైపుకే మరలుతున్నాయి.

"కొడుకుల్ని కంటే పున్నామ నరకం నుంచి రక్షిస్తారనుకుంటే కొడుకులే ఆ నరకాన్ని ప్రత్యక్షంగా మనకు చూపిస్తున్నారు. వూరికే అలా ఖాళీగా గోళ్ళు గిల్లుకుంటూ కూచోకపోతే ఏదైనా ప్రైవేట్ కంపెనీలో చేరి నాలుగు డబ్బులు సంపాయించొచ్చుగా అంటోంది నా కోడలు. ఇన్నాళ్ళూ సంపాయించే కదా దాని మొగుణ్ణి పోషించింది? ఈ వయసులో శరీరం కొద్దిగా విశ్రాంతి కోరుకుంటుందన్న ఇంగితం కూడా లేదాయె. మన బతుకులు చూశావా... పదవీ విరమణ చేసినా ప్రశాంతత కరువైంది" అన్నాడు రమణ మూర్తి.

"నువ్వేమీ మాట్లాడవేమిటి? నీ కొడుకూ కోడలూ పెట్టే హింసలకు నోట మాట కూడా రావడం లేదా ఏమిటి?" అన్నాడు రాఘవయ్య.

నేను నవ్వి "నా విషయం సరే . . . మీరెందుకలా అనుకుని దుఃఖ పడ్తారు? ఈ వయసులో పనిచేయటం ఆరోగ్యానికి చాలామంచిది. అయినా ఎవరికోసం చేస్తున్నాం . . . మన వాళ్ళ కోసమేగా . . . ఇలా అనుకుంటే మనసుకెంత సాంత్వన! మనసునెందుకు అనవసరంగా కష్టపెట్టుకుంటారు? శారీరక శ్రమ కన్నా మనసుకు కలిగే కష్టమే మనల్ని ఎక్కువ క్రుంగదీస్తుంది. పని చేయటం తప్పనపుడు దాన్ని సంతోషంగా చేయండి" అన్నాను.

వాళ్ళిద్దరూ ఏమనుకున్నారో ఏమో మౌనంలో ఒదిగిపోయి మిగతా దూరం నడిచారు. నేను మరలా నా ఆలోచనల అగాధాల్లోకి దిగిపోతూ... నిజంగానే కొడుకుల్లో ప్రేమలూ ఆత్మీయతలూ నశించాయా . . . కోడళ్ళు అమానవీయంగా ప్రవర్తిస్తున్నారా . . .

నా భార్య గుర్తొచ్చింది. పెళ్ళయాక ఉద్యోగరీత్యా మకాం పట్నానికి మారింది. చలికాలంలో కూడా నా భార్య ఉదయం ఐదింటికే లేచి హడావిడి పడిపోయేది. నాకు మనసు పీకుతూనే ఉండేది. అయ్యో పాపం . . . వెచ్చగా పడుకోకుండా చన్నీళ్ళలో చేతులు పెట్టి పనులన్నీ చేసుకుంటుందే . . . లేచి సాయపడ్దామని రోజూ అనుకునేవాణ్ణి.

కానీ దుప్పటికిందున్న వెచ్చదనం లేవనిచ్చేది కాదు. శరీరం సుఖాన్ని కోరుకునేది. అమ్మ చెప్పిందిగా ఆడది చాకిరీ చేయడానికే పుట్టిందని . . . నా భార్య కూడా ఆడదేగా . . . చేయనీ

అని మనసుకు సమాధానం చెప్పుకునే వాడిని. మగవాడినన్న అహం నన్ను డామినేట్ చేసేది. అమ్మ కష్ట పడ్తుంటే అల్లాడిపోయిన నేను భార్య విషయానికొచ్చేప్పటికి వక్ర భాష్యం చెప్పుకునే స్థితికి దిగజారిపోయాను.

ఓ రోజు నా కొడుకు అడగనే అడిగాడు.

"అమ్మ చేతులు చూశావా చలికి ఎలా పగిలిపోయాయో... ఇంతపనీ అమ్మ ఒక్కర్తే చేసుకోవాలా? అలా ముసుగు తన్ని పడుకోకపోతే నువ్వులేచి సాయం చేయొచ్చుగా"

నా చెంప మీద ఎవరో ఛెళ్ళుమని చరిచినట్లయింది. నేను నా చిన్నప్పుడు మనసులోనే మథన పడి నాన్నని అడగడానికి వెనుకాడిన ప్రశ్నని నా కొడుకు నన్ను నిలదీసి అడుగుతున్నాడు. ఏం సమాధానం చెప్పాలో నాకు తోచలేదు. నిజమే కదా . . . మా అమ్మకో నీతీ వాడి అమ్మకో నీతీనా . . .

నీళ్ళు నములుతున్న నన్ను అటువంటి ఇబ్బందికరమైన పరిస్థితి నుండి నా భార్యే కాపాడింది. "పాపం చేస్తానన్నార్రా . . . నేనే వద్దన్నాను. పర్లేదులే. ఈ మాత్రం పని నేను చేసుకోగల్ను. నాకేమీ కష్టంగా లేదులేరా" అంది.

బ్రతుకు జీవుడా అనుకుని నా భార్యకు మనసులోనే ధన్యవాదాలు తెల్పుకున్నాను తప్ప ఆ తర్వాతైనా నా భార్యకు కనీసం చలికాలాల్లోనయినా సహాయపడాలని అనుకోలేదు. మగవాడిని కదా . . .

ఇన్నేళ్ళ తర్వాత నా కోడలు నువ్వీపని చేయి అని స్పష్టంగా, నిర్దిష్టంగా చెప్పటం . . . నా కొడుకుని కూడా లేపి శ్రమ విభజనలో భాగంగా తనవంతు పనులేం చేయాలో నిర్మొహమాటంగా చెప్పటం నాకు సంతోషాన్ని కలుగచేసింది. ఈ మార్పు నేను కోరుకున్న మార్పు. ఆనందకరమైన మార్పు . . .

చిన్నప్పుడు అమ్మ విషయంలో తీరని నా కోరిక . . . పెళ్లయ్యాక భార్య విషయంలో నేను నిర్లక్ష్యం చేసిన కోరిక . . . ఇప్పుడు కోడలు తీరుస్తున్నందుకు సంతోషం నాలో . . .

పాల ప్యాకెట్ నా కోడలిచేతికిచ్చి, "యింకేమైనా పనుంటే చెప్పు తల్లీ. చేస్తాను" అన్నాను.

"చలి వేసిందా మామయ్యా" అంటూ ఆప్యాయంగా అడుగుతున్న నా కోడలి కళ్ళలో వింత మెరుపు . . . నాలో కూడా . . .

*(మయూఖ పబ్లికేషన్స్ వారి సంక్రాంతి కథల పోటీ 2004లో మొదటి బహుమతి పొందిన కథ)*